# ద్వాదశి గ్లాసు

ద్వాదశిగ్లాసు పోయింది. అందమైన, ముద్దొచ్చే కంచుద్వాదశిగ్లాసు-మాంచి దశసరిగా, మధ్య వొంపు తిరిగి నిగనిగలాడే ద్వాదశిగ్లాసు - రోజూ కాఫీలదగ్గర కిష్టిగాడూ, వాసుగాడూ "ద్వాదశిగ్లాసుతో నేను తాగాలంటే నేను తాగాలని" తగూలాడుకునే ద్వాదశిగ్లాసు-పోయింది! పత్తా లేకుండా పోయింది.

ఎలాపోయిందో ఎవరికీ తెలీదు.

ఇంట్లో అందరికీ యీ విషయం కష్టం కలిగించింది. కిష్టిగాడూ, వాసుగాడూ సరే సరి; మొహాలు మాడ్చుకుంటూ కూచున్నారు. ఆఫీసునుంచి వచ్చిన మామయ్య కూడా ఈ సంగతి తెలిసి ఇంట్లో అందర్నీ కేకలేశాడు—"ఎవరేనా యింటికి కొత్తవాళ్ళు వచ్చారంటే ఇహ యింట్లో వాళ్లకు ఒళ్లూ, గిళ్లూ తెలీదు!...ఛఛ! సంసారమన్నాక!...అసలు యీ జాగ్రత్తలన్నీ ఒకళు చెబితే వొస్తాయా?, స్వతహాగా రావాలిగాని!" అంటూ అస్త్ర సన్యాసం చేసి ఆఫీసుకు వెళ్లిపోయాడు.

అందరి సంగతీ అలావుంచి బామ్మకు మాత్రం ఈవిషయం మరీ బాధ కలిగించింది. గ్లాసు పోయిందని మామయ్యతో చెబుతున్నప్పుడు బామ్మకు కళ్ల నీళ్లపర్యంతం అయింది!

కాదా మరి; ఆగ్లాసు ఆవిడ స్నేహితురాలైన స్వర్గీయ నరసాయమ్మగారి జ్ఞాపకచిహ్నం! నరసాయమ్మ చనిపోయేముందు, ఓసారి ఏకాదశి ఉపవాసంచేసి, ద్వాదశి పారణకు ఎవర్నయినా ఒడుగైన కుర్రాణ్ని బ్రాహ్మడికి పిలిచి పెట్టమని బామ్మతో అందిట. అప్పుడు బామ్మ. "ఎవర్నో ఎందుకు నరసాయమ్మక్కయ్యా!, నిక్షేపం వంటి బ్రహ్మచారి వెధవ మా యింట్లో వుండగా." అని చెప్పి, ఆవిడిచేత "అయ్యో నా తెలివిమండా! ఆమాటే మరిచానక్కయ్యా!.. సరే, మరో చోటికి పోవటమెందుకంట, వాణ్ని పంపేం!" అనిపించుకుని, శేషుబావను బ్రహ్మచారిగా పంపిందట. నరసాయమ్మక్కయ్య వాడికి ఆపోశనం వేసుకుని, పంచభక్ష్య పరమాన్నాలు ...వగైరాలతో భోజనంపెట్టి, పాయసంతో నిండిన చక్కని కంచుగ్లాసును వాడికి దానమిచ్చిందట. అదే యీద్వాదశిగ్లాసు! ఇది అయిదేళ్ళ కిందటి మాట......

అంత చరిత్రాత్మకమైన ద్వాదశిగ్లాసు పోతే బామ్మకు దుఃఖం కలగడంలో వింతేమీ లేదు.

ఎలాపోయిందో జాడలేదు. జాడతెలిస్తే పోల్చుకోవడం సులభం. దానిమీద ముత్యాలంతేసి అక్షరాలతో "రావులకొల్లు చంద్రమౌళి పంతులు" అని మామయ్య పేరుంది.

ఎలాపోయిందో......

ఆ ముందురోజు సాయంత్రం ఇంటికి రంగమ్మత్తయ్య—చిన మామయ్య భార్య-వచ్చిందట. రంగమత్తయ్య చెయ్యి ఇటువంటి వస్తువుల్ని చూసినప్పుడల్లా కాస్త స్వైరవిహారం చేస్తుండటం కద్దు!...... ఆవిడ తిరిగి వెళ్ళిపోయినాక — రాత్రి అన్నాల దగ్గర కిష్టిగాడు ద్వాదశిగ్లాసు కోసం వెతికి తేలేదు!

"ఇది తప్పకుండా ఆరంగిపనేరాబాబూ! ఆ గ్లాసు దానింట్లో అయినా చేరి వుండాలి; లేదా రెక్కలు కట్టుకుని మరో దేశానికి ఎగిరిపోయైనా వుండాలి." అంది బామ్మ.

## పణతుల రామచంద్రయ్య

"అవునే బామ్మా! ఈ మధ్య పత్రికల్లో కూడా చదివినట్లు జ్ఞాపకం — అదేదో దేశంలో కంచాలూ, అవీ ఎగిరిపోతున్నాయనీ—" అన్నాను.

ఈ గ్లాసు ఎగిరిపోయినా ఆ రంగి యింట్లోనే తిరిగి వాలివుంటుంది" అంది బామ్మ. పాపం! బామ్మకు రెండు రోజుల్నించీ అన్నం కూడా సరిగా సహించటం లేదు.

నాలుగోరోజు ఆచోకీ తెలిసింది. అందరి అనుమానమూ అక్షరాల నిజమయింది. రంగమ్మత్తయ్య యింట్లోనే వాలిందట ఆగ్లాసు!

వరహాలతో నింపిన పెద్దబంగారు బిందె హఠాత్తుగా పోయి హఠాత్తుగా దొరికినంత సంతోషం బామ్మకు! చచ్చి స్వర్గానికి పోయిన నరసాయమ్మక్కయ్య ఉన్నట్టుండి భూలోకానికి దిగివచ్చి, తన్ను అమాంతం కౌగలించుకున్నట్లయింది ఆమెకు!

బామ్మ స్వతహాగా అహింసావాది. అందువల్ల ఈ ఆచోకీ తెలియగానే రంగమ్మత్తయ్య మీద కోపం సెగలు లేచినా, కడుపులో అగ్నిపర్వతాలు విజృంభించినా-ఏమీ తెలియనట్లే అతిసౌమ్యంగా కార్యం సాధించుకు రాదలచింది. పాలచెంబులు మొహంలో దొంతర్లాడించుకుంటూ పోయి, రంగమత్తయ్యను కదలేసింది.

"ఈ రోజు మా తమ్ముడికి ఏం కూర వండి పెట్టావే" అంటూ సంభాషణకు నాందీ పలికి, "అయ్యో! అదేం నాగరీకమే మా తల్లీ? రోజుకు రోజుకూ నూలుదారమై పోతున్నావూ! మా తమ్ముడికి బియ్యం ఆదా చేస్తున్నావంటే—నీ నాగరీకంమీద వానకురిసిపోనూ!" అన్నదాకా వచ్చి; ఆ తర్వాత ద్వాదశి గ్లాసు విషయాన్ని పట్టుమడతల్లో చుట్టి ఆవిడముందు పెట్టింది.

అయితే రంగమ్మత్తయ్యమాత్రం ఏం తక్కువ తిన్నది గనక! కాకుంటే, అప్పుడప్పుడు చెయ్యిమాత్రం ఏదో ముందూ వెనకా లేకుండా ప్రవర్తిస్తూ వుంటుందని కాని, నోరు విప్పితే ఎంత సౌమ్యమనీ, ఎంత లాలనా, ఏమిటదా!

ఆమె ఏమన్నదంటే—

"అయ్యొయ్యొయ్యొయ్యొ! ఎవరు చేశారే వొదినా అంతపనీ! ఎవరికి చేతులాడాయో నమ్మా!...పాపం, చచ్చి ఏలోకానవుందో నరసాయమ్మొదిన, ఆ గ్లాసు చూడగానే గుర్తొచ్చేది. అయినా ఎవరు తీశారో, వాళ్ల చేతులు విరిగిపోనూ..."

బామ్మ ఎడదలో బడబాగ్ని సెగలు రేగింది. "నీ చేతులు విరిగిపోతే ఎలాగే, ఇంకా ఎన్ని ద్వాదశి గ్లాసులు జాగ్రత్త చెయ్యాలో నువ్వు" అని స్వగతం చెప్పకుంది. ఆ మరుక్షణంలోనే ఆ విషయాన్ని మార్చేసి (ఇదే బామ్మలోని ప్రత్యేకత), ఏదో లోకాభిరామాయణం మాట్లాడుతూ, ఇల్లు నలుమూలలా దృష్టి సారించింది. సారించేసరికి, ఇంకేముందీ' దక్షిణపుమూల, ఆవకాయ జాడీ పక్కనే ద్వాదశిగ్లాసు కనిపించింది!

అయితే బామ్మ వెంటనే లంఘించి ఆ గ్లాసును చేతిలోకి లాక్కోలేదు. తన కోపాన్నీ, ఆశ్చర్యాన్నీ గుండెల్లోనే అదిమిపట్టుకుని, ఏదో పనివున్నట్లుగా ఆ యింట్లో కాస్సేపు ఆ వేపుకూ యీ వేపుకూ తిరిగింది. రంగమ్మత్తయ్య చూస్తుండగా ఆవిడ కన్నుగప్పి దాన్ని ఇవతలికి దాటేయడం బ్రహ్మదులకూడా తరం కాదని బామ్మకు తెలుసు. అందువల్ల, అలా పచార్లుచేసి, అప్పుడే చూసినట్లుగా

# నేషనల్-ఎక్కో

కంపెనీవైన

## రెండు దివ్యమైన రేడియోలు

### స్వర మాధుర్యమునకు సాటిలేనివి



మోడలు 187: 6 వాల్వులు, 8 బ్యాండులు; 13, 16, 19, 25, 31, మరియు 41 మీటర్ల బ్యాండ్‌స్ప్రెడ్ చేయబడినవి. సొగసైన కఱ్ఱ క్యాబినెట్. ఎ-187 ఎసి కరెంటుతోను, యు-187 ఎసి లేక డిసి కరెంటుతోను పనిచేయును.

ధర రు. **450/-** నెట్

మోడలు 270/1·



'ఖ్యాకుమార్ – 5 వాల్వులు, 3 బ్యాండులు; క్రమముగా త్రిప్పుతూ మార్చుకోగలిగే టోన్ కంట్రోలు. చాల పెద్ద ట్యూనింగ్ స్కేలు. చాల పెద్ద క్యాబినెట్ మోడలు ఎ-270/1 ఎసి కరెంటుతోనూ, యు-270/1 ఎసి లేక డిసి కరెంటుతో పనిచేయును

రు. **300/-** నెట్

## నేషనల్-ఎక్కో రేడియోలు శ్రేష్ఠమైనవి

—అవి మాన్‌సూనైజ్* చేయబడినవి

* భారతదేశమువంటి ఉష్ణదేశములలో అన్ని శీతోష్ణస్థితులలోను బాగుగా పనిచేయుటకు మామూలుగా జరుపుతున్న కన్న 16 సార్లు ఎక్కువ సురక్షితముగా చేయబడినవి

ఏ నేషనల్-ఎక్కో వ్యాపారియైనా వీనిని మీకు ఉచితముగా పెట్టి విని పించుటకు సిద్ధమే ఈ రేడియోలతో 12 నెలల గ్యారంటీ కలదు. స్థానిక పన్నులు అదనము

**జెనరల్ రేడియో & అప్లయన్సెస్ ప్రైవేట్ లిమిటెడ్**

ఒపేరా హౌస్, బొంబాయి 4 • 3 మదన్ స్ట్రీట్, కలకత్తా 13 • 1/18 మౌంట్ రోడ్, మద్రాసు • 36/79 సిల్వర్ జూబ్లీ పార్క్ రోడ్, బెంగుళూరు • లోగ్గియాన్ కాలనీ, చాందినీ చౌక్, ఢిల్లీ

GRA 5343


# ద్వాదశి గ్లాసు

సంభ్రమాశ్చర్యాలు నటిస్తూ, ఆ గ్లాసును చేతిలోకి తీసుకుని—"ఇదిగో నే పిల్లా గ్లాసు! చూశావా, యీ పిల్ల వెధవలు ఆటల్లో తీసుకొచ్చి యిక్కడ పడేసివుంటారు. నీ మతిమరుపులో నువ్వు చూసి వుండవ్." అంది!

అయితే, ముందుగా నే మనవి చేసుకున్నానుగా, రంగమ్మత్తయ్య బామ్మకంటె రెండాకులు ఎక్కువే చదివిందని! ఆవిడ హనుమంతుడల్లే బామ్మ దగ్గరికి వచ్చి, నెమ్మదిగా ఆ గ్లాసును బామ్మ చేతుల్లోంచి ఊడలాక్కుని కింద పెట్టింది.

అలా వూడలాక్కుంటూంటే బొమ్మలా నిల్చుని చూస్తున్న బామ్మతో రంగమత్తయ్య "అయ్యో! నేననుకుంటూనే వున్నా వొదినా, మీ ద్వాదశి గ్లాసూ ఇదీ ఒకే పోలికగా వున్నాయా, ఎప్పుడో వీట్ని గురించి కీచులాటలు తప్పవని అనుకుంటున్నట్లే అయింది గదా!" అంది.

ఈ మాటల్తో బామ్మ కోపం ఉన్నతోన్నత శిఖరాల నందుకుంది. ఆవిడ రెచ్చిపోయి, "చూసి మాట్లాడవే! దాని మీద పేరు చూడు-చంద్రమౌళి అని రాసివుందో లేదో" అంది.

ఐతే, యీ మాత్రపు కోపాలకే జడిసిపోతే రంగమ్మత్తయ్య ప్రత్యేకత మాత్రం ఏముంది? ఇలాంటి సాక్ష్యంలేని ప్రశ్నలకు జవాబు చెప్పడం ఆవిడకొక లెక్కలోది కాదు ఈ సంగతి మీరీ పాటికే గ్రహించి వుంటారు.

"హాయ్యో! అదికాదే వొదినా, మొన్న నెవరో ఇలాంటి గ్లాసులు అమ్మొస్తేనూ, ఒక్కటేనా కొని పెట్టమని నానిగాడు ఒకటే గోల. ఇక కొనకుంటే ఊరుకోడు గదా మొండి వెధవ! అందులోనూ మొండి అనేది రావులకొల్లు వారి వంశంలో ఈనాడు కొత్త కొదాయె! ఏమమ్మోయ్ వదినా! అదిగో చూశావా, రావుల కొల్లు వారి నసేసరికి ఎంత కోపమొస్తోందమ్మ నీకూ! సరే తరవాత తీరా చేతిక్కవరూ పాయీ పెట్టి కొనేసరికి—ఆ వెధ చెక్క వాడు తయారై కూమని "ఎం పేరెయ్యమంటా రమ్మగారూ?" అంటూ ఒకటే సొద! ఇదిగో, నువ్వే చెప్పొదినా, అంతమందిలోనూ 'ఆయన' పేరు చెప్పి వెయ్యమనడ మెలాగ చెప్పు? అదే యీ కాలప్పిల్లలైతే అడక్కముందే చెప్తుంటారనుకో, గంట కొట్టినట్టు! నిజం చెప్పొద్దు తల్లీ, నాకు చచ్చే సిగ్గయ్యింది. అంగువల్ల, ఎవరి పేరైతే యేంలే, ఇందులో కాదనేది మాత్రమేముందీ అనే వుద్దేశంతో, పెద్దాయన పేరు చెప్పి, ఆపేరే వెయ్యమన్నా

ననుకో. ఇదే వొదినా నేం చేసిన పాపం. చేసిన పాపం చెబితే పోతుందంటారు ." అంటూ కథనం చేసింది రంగమ్మత్తయ్య

ఈ మాటలు వింటూ బామ్మ ఎలా మండిపోయిందో, ఆమె గుండెల్లో ఎన్ని ప్రళయకాల భయంకర పర్జన్యాలు గర్జించాయో చెప్పలేను గాని, ఆవిడ మరొక్క క్షణం అక్కడ కూచోకుండా లేచి వచ్చేసిన మాట మాత్రం నిజం

అంతే! ఆరోజునుంచీ రంగమ్మత్తయ్య కూడా మా యింటికి రాకపోకలు తగ్గించింది అథవా వచ్చినా బామ్మ ఆవిడతో మాట్లాడదు. పాపం బామ్మకు సరిగ్గా అన్నం సయించడంలేదు స్వర్గంలో వుందనుకొన్న నరసాయమ్మ బామ్మ హృదయంలోకివచ్చి కూర్చుని "నా ద్వాదశి గ్లాసు మాటేమిటి? ఇందుకేనా ఆ గ్లాసు నీకిచ్చింది?" అంటూ గొడవ చేస్తోంది

ఎలాగ తిరిగి ఆగ్లాసు రాబట్టడం? బామ్మకిదే సమస్య ఐపోయింది

చిత్రమేమిటంటే, మానవుడు పరిష్కరించలేని ఎన్నో జటిల సమస్యల్ని విధి ఇట్టే పరిష్కరించి పారేస్తుంటుంది లేకపోతే, బామ్మతో తగూ పడినాక నెల తిరక్కుండానే రంగమ్మత్తయ్యకు అంత జబ్బుచేస్తుందని ఎవరనుకున్నారు?

వాళ్ళూ వీళ్ళూ సలహాలమీదట రంగమ్మత్తయ్యను మామయ్య అమెరికన్ ఆస్పత్రిలో చేర్పాడు రోజు రోజుకూ జబ్బు ఎక్కువౌతోందేకాని తగ్గుముఖం కాలేదు. ఎన్ని స్పర్థలున్నా ఇలాంటప్పుడు సాధింపులు పనికిరావు కదా! అంచేత బామ్మ ప్రతిరోజూ ఆస్పత్రికి పోయి రంగమ్మత్తయ్యను పలకరించి వస్తుండేది

ఓరోజు బామ్మ రంగమ్మత్తయ్యను చూడటానికని ఆస్పత్రికిపోయింది ఆమె వెళ్ళేసరికి రోగి దగ్గర ఎవ్వరూ లేరు; రంగమ్మత్తయ్య మేలుకుని పడుకొనివున్నది అంతకు ముందు రోజునుంచీ జ్వరం కొంచెం సుమారుగా వుంది ఆవిడకి

బామ్మను చూడగానే రంగమ్మత్తయ్య నీరసంగా, "రావొదినా, ఇలా వచ్చికూచో" అంది చెయ్యిచూపిస్తూ. పాతాళబిలం లోపల్నుంచి మాట్లాడుతున్నట్టుంది ఆవిడ గొంతు.

బామ్మ వెళ్ళి పడకమీద కూచుంది

రెండు నిముషాలు నిశ్శబ్దంగా గడిచాక, "ఎలావుందే?" అని అడిగింది బామ్మ.

"ఎలావుంది? హుఁ, హుఁ, హుఁ! అధ్వాన్నంగా వుంది

ఈ జీవి ఇంతటితోకడతేరిపోయినా "

అంది రంగమ్మత్తయ్య మూల్గుతూ

"అయ్యో, అదేవిఁటే" అంది బామ్మ అసలు రంగమ్మత్తయ్య అలా అన్నదే కాని, ఆవిడకి మాత్రం తెలీదూ, తను చనిపోదనీ, చనిపోలేదనీ!

ఆవిడ మళ్ళీ మూల్గుతూ "హుఁ ఏమో నమ్మొదినా? నాకేం, నేను బతుకుతానని నమ్మకం అవుపించడంలేదు . ఇదిగో వొదినా, నేను వెళ్ళిపోయేటట్లయితే ఆయన్నూ, పిల్లగాడ్నీ నీ చేతుల్లో పెట్టిపోతున్నాను " అంది

"ఊ! ఊరుకో ఏంమాటలు?" అంది బామ్మ మందలింపుగా రంగమ్మత్తయ్యకేమీ ఢోకాలేదని తనకూడా నిర్ధారణ అయినందువల్ల, అంతకంటె యెక్కువగా ఆవిణ్ణి ఓదార్చవలసిన అవసరం కనిపించలేదు బామ్మకు!

బామ్మ అంది "ఆఁ, యేమిటో ఎప్పుడో ఒకప్పుడు అంతా కదిలి వెళ్ళవలసిందే, ఆ శ్రీమన్నారాయణమూర్తి పిలుపు వచ్చినప్పుడు తప్పుతుందా? ఆ వెళ్ళిపోయే సమయంలో మనస్సు శాంతిగావుంటే చాలు "

రంగమ్మత్తయ్య అదిరిపడింది. "అవును" అన్నట్టుగా ఒక్క మూలుగు మూలిగింది.

బామ్మ మళ్ళీ అంది

"ఇగుగో, నీసంగతికూడా ఎటొచ్చీ ఎటొస్తుందో ఇప్పటికి ఆందోళనగా వుంది . ఇటు వంటప్పుడయినా కొస్త మనస్సుకు శాంతివుండాలి కదా, ఎటువంటి కల్మషమూ లేకుండా "

రంగమ్మత్తయ్యకు భయమేసింది! ఎవరో తన్ను మంచంతో సహా గాలిలోకి ఈడ్చుకు పోతున్నట్టనిపించింది ఏమిటి? తను చనిపోతుందా? చనిపోతుందా? నిజమేనా? మరి తనింకా బతుకుతుందనుకుంటోందే? ఏమో ఏమో!

రంగమ్మత్తయ్య మాట్లాడలేకపోయింది.

బామ్మ "ఒప్పుకుంటున్నావు గదా! . ఇదిగో అమ్మాయ్! నీ విషయంలో ఒక్కటడుగుతున్నాను దానిమీద ఇదివరకు జరిగిందేదో జరిగిపోయింది ఇప్పుడైనా మనస్ఫూర్తిగా నిజంచెప్పు నేనుకూడా ఇంకో విధంగా అనుకోను" అంది.

"ఏవిఁటొదినా?"

"ఏంలేదు ద్వాదశి గ్లాసుసంగతి నిజం చెప్పమ్మాయి! ఈ సమయంలోనైనా నీ మనస్సుకు శాంతి కలుగుతుంది కాస్త" అంది బామ్మ

అంతే!

ఈసారి అగ్నిపర్వతాలు ప్రేలటమూ లేదు, సెగలు రేగటమూ లేదు.

రంగమ్మత్తయ్య తప్పు ఒప్పేసుకుంది "నన్ను క్షమించానను వొదినా! ఆరోజు నే చెప్పింది అబద్ధమే నీకు నా మీద ఆపేక్షవుంటే తిరిగి ఆ గ్లాసు నీయింటికి చేర్చు! పాపిష్టిదాన్ని ఆ లోకంలో నరసాయమ్మొదిన ఎన్ని శాపనార్థాలు పెడుతోందో నామీద వొదినా, నన్ను క్షమించానని వొట్టువెయ్యి " మొదటే నీరసంగా వున్న రంగమ్మత్తయ్య కంఠం మరీ పూడుకుపోయింది.

బామ్మ పెదాలమీద చిరునవ్వూ, అభయముద్రా!

"పిచ్చిదానా! అలా బెంబేలు పడిపోతావేమిటే? నువ్వేం చేశావని క్షమించటానికి? కాకుంటే—నీమనస్సు ఎలాంటి కలతలేకుండా వుండాలనిగానీ, ఆ ముష్టి ద్వాదశిగ్లాసుకోసమటే యావనాకు? అది ఎవరింట్లో వుంటేనేం? అలాంటివేం పెట్టుకోక కాస్త నిమ్మళంగా పడుకో ఈ జ్వరమేం చేస్తుంది? రేపిపాటికి తగ్గిపోదూ! . వెర్రిబాగుల్దానా! నరసాయమ్మక్కయ్య ఎందుకు తిడుతుందే నిన్ను?—పాపం! నిజంగా దేవత! నీకు తెలీదూ, నిజంగా నువ్వంటే ఎంత ప్రేమగా వుండేదో . నిన్ను "రంగీ, రంగీ" అంటూ .."

తర్వాత మరో గంటసేపు అక్కడే కూచుని రంగమ్మత్తయ్యమీద ఈగవాలకుండా పరిచర్యలు చేసి ఇంటికొచ్చింది బామ్మ

నాలుగైదురోజుల్లో రంగమ్మత్తయ్య పూర్తిగా కోలుకుంది ఆస్పత్రినుంచీ యింటికి తీసుకొచ్చారు.

ఆరోజే బామ్మ చూచిరావడానికివెళ్ళింది రంగమ్మత్తయ్యను కూచోబెట్టి, ఆ పూటకి తనే అక్కడ వంటచేసి ఆవిడకు పథ్యం పెట్టింది.

ఆ సాయంత్రం తిరిగివస్తూ, రంగమ్మత్తయ్యతో "ఏమేవ్! పథ్యం జాగర్త కూడనవీ కూడనివీ తిని మళ్ళీ తిరగబెట్టేను - నువ్వసలే అస్తావిస్తప్పిల్లవి ఇదిగో, ద్వాదశిగ్లాసు తీసుకెళ్లుతున్నాను" అని చెప్పి, ద్వాదశి గ్లాసును ఇంటకి తీసుకు వచ్చేసింది బామ్మ

ఆరోజు బామ్మ తేలికగా, తృప్తిగా నిట్టూర్చింది. ★

